# కాలానికి విలువలేదు

సరిగ్గా ఎనిమిదయ్యేటప్పటికి కాలాంతకరావు 'యూనివర్సల్ టైమ్‌కీపర్స్' అనే వాచీకంపెనీ గుమ్మందగ్గర కొచ్చేడు. అతనక్కడ పనిచేస్తున్నాడు.

కుర్రాడు అప్పటికే తలుపులు తెరిచి, బూజులు దులపడం పూర్తిచేశాడు.

హోటల్లో 'ఛాయ్' తాగి అహమ్మద్ హుస్సేనీ అనే మరో గుమాస్తాకూడా తిరిగివచ్చాడు.

కాలాంతకరావు పని అంతా 'రిపేరింగు' శాఖలో. అక్కడ టేబిల్‌దగ్గర కూచుని వొచ్చిన ఆర్డర్లను తీసుకుని వాళ్లవద్ద అడ్వాన్స్ తీసుకుని, రసీదుల్లో మళ్లీ ఏరోజు రావల్సిందీ రాసి రమ్మనమనడం.

వ్యాపారసరళిలో, మాటల చమత్కారంలో, కస్టమర్సుని బోల్తా కొట్టించే చాకచక్యంలో అతనిది పెట్టిందిపేరు.

అబిడ్ రోడ్డులో వున్న ఆ దుకాణానికి మీరూ ఒకసారి కాకపోతే మరోసారయినా వెళ్ళివుంటారు, మీకు వాచీ అనే దస లోకటుంటే.

కాలాంతకరావు కీ రాష్ట్రంలోని ఐదుభాషలే కాక అరవం, బెంగాలీకూడా కొంచెం కొంచెం తెల్సు.

అతని ఈ భాషాప్రావీణ్యమే అతనికి ఆ శాఖలో ఉద్యోగాన్ని తెచ్చిపెట్టింది.

బూజులు దులిపాక కుర్రాడు చెయ్యాల్సినపని గడియారాల్ని అన్నిటిని ఒకే టైముకు తీసుకురావడం. 'ఏ రెండు వాచీలు ఒకే కాలాన్ని చూపవు' అనే దానికి ప్రత్యక్షసాక్ష్యం కావాలంటే ఏ వాచీ కంపెనీనైనా తెరిచేటప్పుడు చూస్తే కనపడుతుంది.

గడియారాలన్నీ సరిదిద్దేటప్పటికి తొమ్మిది అయింది.

కాలాంతకరావు కాఫీకి ఆర్డరిచ్చి తన 'కస్టడీ'లో వున్న గడియారాలనన్నీ పైకితీసి 'షో'కేస్‌లో తగిలించసాగాడు. ప్రతీ వాచ్‌కీ రిపేర్ చార్జీ ఎనిమిది నుంచి ముప్పై రూపాయలవరకూ ఉంటుంది. మరమ్మతీలకోసం రోజుకి ఓ వంద వాచీలన్నా రాకమానవు. సాధారణంగా వాచీ కంపెనీలకి అదే ఓ పెద్ద రాబడి.

సొంత వాచీ అనేది ఒకటీ లేకపోయినా అతని చేతిని ఎప్పుడూ మూడు వందల రూపాయల విలువ చేసే వాచీ వుంటుంది. మరమ్మత్తులకొచ్చినదాంట్లో మంచిదాన్ని ముందు బాగుచేయించి చేతికి అలంకరించుకుంటాడు. ఒకవేళ దాన్ని స్వంతదారు చూస్తే 'టెస్ట్' చేస్తున్నాను అంటాడు.

ఆ కంపెనీలో ప్రపంచంలో దొరికే రకరకాలైన వాచీలన్నీ వుంటాయి. ఆ కొట్టుకి మొత్తం విలువకట్టడం అసాధ్యం. అందులోకి ప్రతీవాడూ ఆకర్షించబడతాడు; ఆకర్షించబడిన ప్రతీవాడిపనీ సాలిగూటిలో దూరిన ఈగలా అవుతుంది; ఏదో ఒకటి కొనకుండా బయటికి రాలేడు – బీదవాడైనా ధనవంతుడైనా ! ఇరవై నుండి పదిహేను వందల రూపాయలవరకూ విలువచేసే వాచీలున్నాయి. అక్కడి గుమాస్తాలు 'కాఫీ' 'టీ'లు ఇచ్చీ, 'కాప్టన్' సిగరెట్‌లు ఇచ్చీ ఎలాగో ఒకలా వాళ్ళని లోబర్చుకోగలుగుతారు. 'టోపీ' లో పడుతున్నామనే ఆలోచన ఆ ఖాతాదార్లకి తెలీదు. ఏదో లాభసాటి బేరంతో బయటపడుతున్నామనుకుని సంతోషిస్తారు, ఆ అమాయికులు. కాని వాళ్ళు వెళ్ళగానే గుమాస్తాలు వాళ్ళల్లో వాళ్లు నవ్వుకుని 'ఎంతలా టోపీ వేయగలిగిందీ?' 'ప్రజలు ఎంత అమాయకులైందీ!' తెల్సుకుని సగర్వులవుతారు.

అంతకంటె ఆశ్చర్యకరమైన విషయాలు కాలాంతకరావుశాఖలో జరుగుతాయి.

"ఏమండీ నావాచీ నాలుగు నిమిషాలు ఫాస్ట్ తిరుగుతోందండి"

"నావాచీ ఎనిమిది నిమిషాలు స్లో తిరుగుతోందండీ."

"నావాచీకి రేడియం డైయల్, ముళ్ళు, స్టెయిన్‌లెస్‌స్టీల్ కేసూ వెయ్యాలండీ."

"నావాచీకి ఓవర్ ఆయిలింగ్ (ఓవర్ హాలింగ్ అనడానికి బదులు) చెయ్యాలండి"

ఇలా అనేకులు అనేకవిధాలైన రిపేర్ల కోసం వస్తూంటారు. వాళ్ల అమాయికత్వాన్ని చూస్తే అతనికి ఆశ్చర్యం, విషాదం కలుగుతాయి. ఓ నిమిషం ముందుగా నడుస్తేనేం, ఓ నిమిషం ఆలస్యంగా తిరుగుతేనేం ? ఏదో పుట్టె మునిగిపోయినట్టు ఎందుకూ ఈ అనవసరపు ఖర్చు. నిజంగా మనుషులు 'సెకన్ల'మీద నడుస్తున్నారా ?"

అతనిలో అతను నవ్వుకునేవాడు. కాని అతని ఉద్యోగమే అది ! ఎవళ్ళకిగాని వాళ్ళ అమాయకత్వాన్ని ఎత్తి చూపడంకన్న, నిర్లక్ష్యంచేస్తేనే ఎక్కువ సంతోషం కలుగుతుంది. 'పై ప్రజలు మూర్ఖులు; గ్రహించలేరు' అనుకుని ఆత్మసంతుష్టి చెందుతారు. కాని వెనకాల నవ్వులూ, హేళనలూ వాళ్ళకు తెలీవు.

కాలాంతకరావు ఇంటర్ ఫైయిలయ్యాడు. అతని విజ్ఞానశాస్త్రంమీద గల గాడాభిమానం మాత్రం చావలేదు. అందువల్ల విజ్ఞానశాస్త్రంలో గల పుస్తకాల్నన్నిటినీ వీలుదొరికినప్పుడు చదివేవాడు. ప్రజల వింతభావాల్ని చూసినప్పుడు మనస్సులో ఇలా అనుకునేవాడు:

'కాలం అంటే ఏమిటి? దానికి ఓ విలువవుందా? మనం అనుకునే కాలప్రమాణం, నెలలూ, రోజులూ, గంటలూ, నిమిషాలూ, క్షణాలూ, తారీఖులూ వీటన్నిటికి నిజమైన

విలువలున్నాయా? ఏ క్రైస్తు చావుతోనో, పుట్టుకతోనో లేక, ఇంక దేనితోనో సంబంధాన్ని పెట్టుకుని కాలపుకొలతలు నిర్ణయించుకుని దానికి దాసులమవడం మన మానసిక దౌర్భల్యాన్ని చూపించదా?'

ఎంత ఆలోచించినా అతనికి కాలానికి స్వంత విలువవున్నట్టు తోచలేదు, దేనితోనో 'రెలెటివ్'గా ఆలోచిస్తేనే తప్ప.

అదీగాక ఏ రెండు వాచీలు ఒకే కాలాన్ని ఎప్పుడూ చూపించవు అనే యథార్థాన్ని అతను కళ్ళారా రోజూ చూస్తూనేవున్నాడు. అందుకనే తన దుకాణంలో రోజూ మూడు గంటలకొకసారి గడియారాలటైంని కలపవల్సి వోస్తోంది. దానికోసం నలభైరూపాయల జీతంమీద ఒక కుర్రాడ్ని నియమించుకున్నారుకూడా!

'సూక్ష్మదృష్టితో చూస్తే ఏదో ఒక ప్రమాణంలేకపోతే సాధారణ పనులు జరగడం కష్టం. అందుకే ఈగడియారాలూ, వాచీలూ, అనుకున్నాడు.

వాచీలు షోకేస్‌లో తగిలించి, కాఫీ సేవించేసరికి, ఎవరో వచ్చి "ఈ వాచీ చూడండి; మరమ్మతు కెంతవుతుందో అనసాగారు.

కాలాంతకరావు లేని నవ్వుని తెచ్చుకుని తన పనిలో నిమగ్న మవసాగాడు.

*03. 03. 1954–ఆంధ్ర సచిత్ర వారపత్రిక*